నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
బుధవారం
18 డిసెంబర్
2024
పేజీలు 8
గుంటూరు
పల్నాడు






## కేంద్ర సాయంతో ప్రతిష్టాత్మక ..
# ఎయిమ్స్‌కు పునాది



**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**
మెడికల్ సైన్స్‌లో టెక్నాలజీని వినియోగించడం ద్వారా వైద్యరంగంలో అద్భుతాలు సాధించవచ్చుని, టెక్నాలజీ ద్వారా రోగుల చెంతకే వైద్య సేవలు అందించడం సాధ్యమవుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. మెడికల్ సైన్స్ ఇప్పుడు మెడ్‌టెక్ సైన్స్ అయ్యిందన్నారు. డీప్‌టెక్ వంటి నూతన సాంకేతిక **మిగతా 3వ పేజీలో**

- మౌలిక వసతులతో 2019లోనే సేవలు తెచ్చాంలి
- రూ.10కే అందరికీ నాణ్యమైన వైద్యం
- టెక్నాలజీ సాయంతో వైద్యరంగంలో విప్లవం
- ఎయిమ్స్‌కు మరో 10 ఎకరాల భూమి కేటాయిస్తాం
- ఎయిమ్స్ స్నాతకోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము. సీఎం నారా చంద్రబాబు




# జమిలీకి టీడీపీ మద్దతు

- వికసిత్ భారత్‌లో భాగస్వామ్యమే లక్ష్యం
- ఎన్నికల ఖర్చు తగ్గే అవకాశం
- గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డా.పెమ్మసాని వెల్లడి



**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**
వన్ నేషన్- వన్ ఎలక్షన్ కు సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. వికసిత్ భారత్ 2047 ద్వారా దేశ నిర్మాణానికి చేపట్టిన కార్యక్రమాలకు టీడీపీ కట్టుబడి ఉందని తెలిపారు. దేశ సమాఖ్య స్ఫూర్తి, పురోగతి, అభివృద్ధిలో భాగస్వామ్యం అయ్యేందుకు వికసిత్ ఆంధ్ర 2047 ను అనుసంధానం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.

**అనేక ప్రయోజనాలు**
వన్ నేషన్ వన్ ఎలక్షన్ ద్వారా అనేక ప్రయోజనాలు ఉన్నాయని కేంద్రమంత్రి పెమ్మసాని తెలిపారు. 2019 లోక్ సభ ఎన్నికలకు సుమారు రూ.6 వేల కోట్లు 2024 లో రూ.10 వేల కోట్లపైగా

**మిగతా 3వ పేజీలో**

## పేర్ని జయసుధ గోదాములో
# 4840 బస్తాల రేషన్ బియ్యం మాయం

**తెనాలి, మేజర్ న్యూస్ :** 'శ్రీమతి పేర్ని జయసుధ యజమానిగా ఉన్న జేఎస్ గోడౌన్ లో రేషన్ బియ్యం మాయం ఘటనలో పోలీస్, రెవెన్యూ, పౌరసరఫరాల శాఖలు లోతుగా విచారణ జరుపుతున్నాయి. ప్రజలకు సంబంధించిన రేషన్ బియ్యాన్ని దారి మళ్లించి ఆధారాలను నాశనం చేయాలని చూస్తున్నారు. మాయమైన బియ్యానికి డబ్బు కడితే సరిపోతుందని అనుకుంటున్నారు. క్రిమినల్ కేసులు నమోదు చేశాం. తప్పు చేసిన వారికి శిక్ష తప్పద'ని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. ఆ గోడౌన్ లో 3 వేల బస్తాలు కాదు... 4840 బస్తాలు మాయం అయ్యాయని తెలిపారు. గత ప్రభుత్వంలో బాధ్యత కలిగిన పదవిలో ఉండి... ప్రజలు అప్పగించిన బాధ్యత ఎంతో దారుణంగా నిర్వర్తించారో సాక్ష్యాధారాలతో ప్రజల ముందుపెడతామని అన్నారు. కూటమి ప్రభుత్వంలో ఎవరి మీద కక్ష సాధింపు చర్యలు ఉండవని, తప్పు చేసిన వారు ఎవరైనా చట్టం నుంచి తప్పించుకోలేరని అన్నారు. అక్కడే ఉన్న రెండో గోదాముపైన అనుమానాలు ఉన్నాయని అన్నారు. మంగళవారం తెనాలిలోని క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ. "పౌరసరఫరాల శాఖ రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన తర్వాత రాష్ట్రంలోని 1300 రైస్ మిల్లులకు అందించి బియ్యంగా మారుస్తాం. ఆ బియ్యాన్ని రాష్ట్రంలోని 104 గోడౌన్లలో భద్రపరుస్తాం. ఇక్కడ నిల్వ చేసిన బియ్యాన్ని రేషన్ కార్డుదారులకు, అంగన్వాడీ కేంద్రాలకు, సాంఘిక సంక్షేమ **మిగతా 3వ పేజీలో**

- ంషన్ బియ్యం మాయంపై లోతుగా విచారణ
- తప్పు చేసిన ఏ ఒక్కరినీ వదిలిపెట్టం...
- సాక్ష్యాధారాలతో ప్రజాక్షేత్రంలో నిలబెడతాం
- తనిఖీలకు సహకరించ లేదు
- రెండో గోడౌన్ పైనా అనుమానాలు ఉన్నాయి
- పీడీఎస్ బియ్యం స్మగ్లింగ్ చేస్తే పి.డి.యాక్ట్ కింద కేసులు నమోదు
- తెనాలిలో విలేకరుల సమావేశంలో మాట్లాడిన రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్



## గుంటూరులో అనధికారిక డ్రైనేజీ కనెక్షన్ ఉండటం నేరం

### కమిషనర్ శ్రీనివాసులు హెచ్చరిక



**గుంటూరు, మేజర్ న్యూస్ :** గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో అనధికార ట్యాప్, డ్రైనేజి కనెక్షన్లు కల్గి ఉండడం చట్టరీత్యా నేరమని, అటువంటి కనెక్షన్ల తొలగింపుకు ప్రత్యేక బృందాలతో డ్రైవ్ చేపడుతున్నామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ గారు మాట్లాడుతూ నగరంలో కుళాయి కనెక్షన్ కు దరఖాస్తు చేసిన నిర్దేశిత సమయంలోనే కనెక్షన్ అందించడం జరుగుతుందన్నారు. వార్డ్ సచివాలయాల వారీగా కార్యదర్శులు ట్యాప్, డ్రైనేజి కనెక్షన్లకు సంబందించి ఇంటింటి సర్వే చేస్తున్నారని, సర్వేలో పలు ప్రాంతాల్లో నగరపాలక సంస్థ అనుమతి లేకుండా షుమారు 6 వందలు కుళాయి, డ్రైనేజి కనెక్షన్లు కల్గి ఉండడం గమనించి వాటి తొలగింపుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. అనధికార ట్యాప్, డ్రైనేజి కనెక్షన్లు చట్టరీత్యా నేరమని, అటువంటి వారు వారం రోజుల్లో స్వచ్ఛందంగా స్థానిక వార్డ్ సచివాలయంలో ఎమినిటి కార్యదర్శిని సంప్రదించి, తగిన డాక్యుమెంట్స్ అందించి ట్యాప్ లేదా డ్రైనేజి కనెక్షన్ కోసం తగిన డాక్యుమెంట్స్ తో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

## రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి

### పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు పిలుపు



**నరసరావుపేట, మేజర్ న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉదయం పలనాడు జిల్లా కలెక్టర్ పి .అరుణ్ బాబు నరసరావుపేట మండలం పెద్దిరెడ్డిపాలెం గ్రామంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ఆకస్మికంగా పరిశీలించారు. రెవిన్యూ సంబంధిత సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు ఈ రెవెన్యూ సదస్సులు ఎంతో ఉపయోగ పడతాయని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి మధులత, మండల రెవెన్యూ అధికారి వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

## భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు దోహదం



**రాజుపాలెం మేజర్ న్యూస్ :** రైతుల భూ సంబంధ సమస్యలు పరిష్కారమే గ్రామ రెవెన్యూ సభల లక్ష్యమని తాసిల్దార్ నెమలిపురి దుర్గేశ్వరరావు అన్నారు, మంగళవారం రాజుపాలెం తాసిల్దార్ కార్యాలయం వద్ద రెవెన్యూ గ్రామసభ నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా తహశీల్దార్ దుర్గేశ్వరరావు మాట్లాడుతూ గ్రామసభల ద్వారా గ్రామాలలో సమస్యల పరిష్కారమే దేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు, రాజుపాలెం సర్పంచ్ పులిబండ్ల అశోక్ మాట్లాడుతూ నిర్వీర్యమైన గ్రామాల్లో జలసత్వాలు తెచ్చేందుకు కూటమి ప్రభుత్వం పల్లె పండుగలు తెచ్చి సర్పంచులకు ఊతమిచ్చిందన్నారు, మంగళవారం నిర్వహించిన గ్రామసభలో భూ సమస్యలపై 15 దరఖాస్తులు వచ్చాయని తాసిల్దార్ తెలిపారు ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ ఐసిడిఎస్ పిడి ఉమారాణి, ఎండోమెంట్ ఈవో శ్రీనివాసరావు, డిప్యూటీ తాసిల్దార్ జానీ భాష, ఆర్ ఐ వంశీకృష్ణ, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

## మొర్జంపాడు గ్రామాల్లో ఆధార్ నమోదు క్యాంపులు



**మాచవరం, మేజర్ న్యూస్ :** ఆధార్ నమోదు కార్యక్రమాల్లో భాగంగా మాచవరం మండలం మాచవరం మొర్జంపాడు గ్రామాల్లో మంగళవారం ఆధార్ నమోదు క్యాంపులు నిర్వహించారు ఈ సందర్భంగా మాచవరం సచివాలయంలో మొర్జంపాడు అంగన్వాడీ సెంటర్లో చిన్నారులకు ఈ ఆధార్ నమోదు ఏర్పాటు చేశారు మొట్టమొదటిసారిగా ఆధార్ నమోదు చేసుకొని పది సంవత్సరాల పూర్తి చేసుకున్న వారు తిరిగి మరల తమ బయోమెట్రిక్ ను సమర్పించి కొత్త ఆధార్ తీసుకోవాలన్నారు ఇందుకుగాను మంగళవారం నుండి 20వ తేదీ శుక్రవారం వరకు మొదటి విడత ఈ క్యాంపులు జరుగుతాయని రెండో విడత 26వ తేదీ నుండి 28వ తేదీ వరకు ఆధార్ క్యాంపులు జరుగుతాయని ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు ఈ కార్యక్రమంలో డిజిటల్ అసిస్టెంట్లు దిల్షా సురేష్ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య పనులు ప్రణాళికా బద్ధంగా చేపట్టాలి

### గుంటూరు నగర కమిషన్ ఆదేశం



**గుంటూరు, మేజర్ న్యూస్**

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో పారిశుధ్య పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని, గ్యాంగ్ వర్క్ ల ద్వారా డ్రైన్లు, సమస్యాత్మక ప్రాంతాలు శుభ్రం చేయడంపై ప్రజారోగ్య అధికారులు దృష్టి సారించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం కమిషనర్ ఏటి అగ్రహారం, ఎన్జీఓ కాలని, సాయి నగర్, నల్లపాడు, బుడంపాడు, శ్రీనివాసరావుతోట తదితర ప్రాంతాల్లో పర్యటించి, అభివృద్ధి పనులను, ఆక్యుపెన్సీ కోసం దరఖాస్తు చేసుకున్న బహుళ అంతస్తు భవనాన్ని పరిశీలించి, అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో మైక్రో ప్యాకెట్స్ వారీగా చేపట్టే పారిశుధ్య పనుల్లో మెరుగుదల ఉండాలని, డ్రైన్లను శుభ్రం చేయడం లేదని పలు ఫిర్యాదులు అందుతున్నాయని, డ్రైన్లను తప్పనిసరిగా మధ్యాహ్నం సమయంలో గ్యాంగ్ వర్క్ ద్వారా శుభ్రం చేయాలన్నారు. శానిటేషన్ కార్యదర్శులు క్షేత్ర స్థాయిలో ఇంటింటి చెత్త సేకరణ, మెయిన్ రోడ్ల స్వీపింగ్, కమర్షియల్ సంస్థలు డ్రైన్లలో వ్యర్థాలు వేయకుండా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. నూతనంగా నిర్మాణం చేసే సిసి రోడ్లకు బరంస్ లేకుండా చేపట్టవద్దని, నిర్మాణ పనుల అనంతరం డెబ్రిస్ తొలగింపుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్జీఓ కాలనీ పార్క్ ని పరిశీలించి, ఓపెన్ జిమ్ పరికరాలు మరమత్తు గురవ్వడం ప్రత్యక్షంగా పరిశీలించి, తక్షణం మరమత్తు చేయాలని, పెండింగ్ పనులపై పార్క్ వాకర్స్ కమిటితో చర్చించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని డిఈఈని ఆదేశించారు. బుడంపాడులోని హిందూ, క్రిస్టియన్ శ్మశానవాటికలను పరిశీలించి, మౌలిక వసతుల కల్పనపై చర్యలు తీసుకోవాలని, ప్రధానంగా నీటి వసతి వెంటనే కల్పించాలన్నారు. అలాగే మెయిన్ రోడ్లపై అవసరాల మేరకు స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయాలని, వాటికి తప్పనిసరిగా ఇండికేటర్స్ ని దూరం నుండే కనిపించేలా పెట్టాలని ఈఈలను ఆదేశించారు. అనంతరం బుడంపాడు మెయిన్ రోడ్ లో ఆక్యుపెన్సీ కోసం దరఖాస్తు చేసుకున్న భవన కొలతలను పరిశీలించిన అనంతరం కమిషనర్ మాట్లాడుతూ భవన నిర్మాణ సమయంలోనే ర్యాంప్ లు రోడ్ల మీదకు నిర్మాణం చేయకుండా నియంత్రించాలని ప్లానింగ్ కార్యదర్శులకు స్పష్టం చేశారు. అలాగే జిఎంసి నుండి తీసుకున్న ఆమోదిత ప్లాన్ మేరకు నిర్మాణం జరుగుతన్నదీ లేనిదీ కూడా పర్యవేక్షణ చేయాలన్నారు. పర్యటనలో డిఈఈలు మధుసూదన్, సతీష్, ఏసిపి వెంకటేశ్వరరావు, ఆర్.ఓ.లు రెహ్మాన్, రవి కిరణ్ రెడ్డి, టిపిఎస్ లు, ఏఈలు, శానిటరీ ఇన్స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

# సుస్థిరాభివృద్ధికి శిక్షణ దోహదం : స్పెషల్ ఆఫీసర్ శ్రీకృష్ణదేవరాయలు

**మాచవరం, మేజర్ న్యూస్ :** సుస్థిరాభివృద్ధి ద్వారా అందరికీ విద్యా వైద్యంతో పాటు అన్ని రకాల సదుపాయాలు అందజేసే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీకృష్ణదేవరాయలు అన్నారు మంగళవారం మాచవరం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సుస్థిరాభివృద్ధి రెండవ రోజు శిక్షణా కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని అలాగే పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామాల అభివృద్ధికి అందరూ సహకరించాలని ఆయన కోరారు అనంతరం ఎల్ ఎస్ డి జి ట్రైనింగ్ ప్రోగ్రాంలో గ్రామ సర్పంచులు మరియు పంచాయతీ కార్యదర్శులు సచివాలయం సిబ్బందికి ట్రైనింగ్ నిర్వహించారు ప్రభుత్వ లక్ష్యసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన సందర్భంగా కోరారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు సూపర్నెంట్ ప్రసాద్ ఈ ఓపిఆర్డి వెంగళరావు ఆయా



గ్రామాల సర్పంచులు, సచివాలయం సిబ్బంది పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ల ఏకగ్రీవంగా ఎంపిక



**మంగళగిరి మేజర్ న్యూస్ :** కృష్ణ వెస్టరన్ డివిజన్ తెనాలి, కొలకలూరి హైలెవల్ ఛానల్, గుంటూరు ఛానల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్లుగా సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం జరిగిన కృష్ణ వెస్టరన్ డివిజన్ తెనాలి డిసి ఎన్నికలలో దుగ్గిరాల నీటి సంఘం అధ్యక్షుడిగా ఎంపికైన గొరినేని అనిల్ కుమార్ ని డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ గా సభ్యులు ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా చినపాలెం నీటి సంఘం అధ్యక్షుడిగా ఎంపికైన విసరపు శేషగిరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కొలకలూరి హైలెవల్ ఛానల్ డిసి ఎన్నికలలో నంబూరు నీటి సంఘం అధ్యక్షులు జొన్నాల మురలీకృష్ణరెడ్డిని డిస్ట్రిబ్యూటరీ ఛైర్మన్ గా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా కె కొండూరు నీటి సంఘం అధ్యక్షులుగా ఎన్నికైనా తాడిబోయిన నాగేశ్వరరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గుంటూరు ఛానల్ -1(ఆత్మకూరు) డిసి ఎన్నికలలో ఉప్పలపాడు నీటి సంఘం అధ్యక్షులు దుద్దుకూరి బుషా బాబును డిస్ట్రిబ్యూటరీ ఛైర్మన్ గా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా ఆత్మకూరు నీటి సంఘం అధ్యక్షులు సాదు కొండలరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన ఛైర్మన్, ఉపాధ్యక్షులను టీడీపీ నాయకులు అభినందించారు.

## ఊడిజర్లలో పొలంపిలుస్తోంది కార్యక్రమం



**ఈపూరు మేజర్ న్యూస్ :** మిరపలో బులుగు, తెలుపు, పసుపు రంగుల అట్టాలను, నల్లి ఉధృతిని తెలుసుకోవ దానకి ముందుగా ఏర్పాటు చేసుకోవాలని మండల వ్యవసాయ విస్తరణాధికారి బండి అప్పారావు తెలిపారు. మంగళవారం అగ్నిగుండాల, ఊడిజర్లలో పొలంపిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాలలో " ధాన్యం కోనుగోలు " చేయటం జరుగతుంది అని రైతు సోదరులకు తెలియజేశారు . అవకాశం ఉన్న ప్రతీ రైతు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.అలాగే పీఎం కిసాన్ ఈకేవైసీ పెండింగ్ వున్న వారు అలాగే మీ ఆధార్ కి బ్యాంక్ లింక్ లేని వారు పోస్టల్ అకౌంట్ ఓపెన్ చేసుకోవాలని సూచించినారు,త్వరగా కంప్లీట్ చేసుకోవాలని,చేసుకొంటే వెంటనే నగదు వారి ఖాతా లో పడుతుందని చెప్పటం జరిగింది, ఈ కార్యక్రమంలో గ్రామ ఉద్యాన సహాయకులు. గాలం యతేంద్ర నాగరాజు, గ్రామ నాయకులు గంటా వెంకట్రామయ్య మరియు రైతు సోదరులు పాల్గొన్నారు.

## పిన్నెల్లి రెవెన్యూ గ్రామసభకు 16 అర్జీలు



**మాచవరం, మేజర్ న్యూస్ :** మాచవరం మండలం పిన్నెల్లి గ్రామంలో మంగళవారం సచివాలయం నిర్వహించిన రెవెన్యూ గ్రామసభకు 16 అర్జీలు అందాయని మండల తహసిల్దార్ క్షమారాణి తెలిపారు రైతులు తమ పంట పొలాలకు సంబంధించిన అడంగులు కాపీల కొరకు ఆన్లైన్ చేయాలని పల్లె రకాల భూ సమస్యలపై అర్జీలు అంది అన్నారు ఈ సందర్భంగా తహసిల్దార్ క్షమారాణి మాట్లాడుతూ గ్రామస్తులు రైతులు రెవిన్యూ గ్రామ సభ ద్వారా మీ మీ సమస్యలను పరిష్కరించుకునేందుకు ఎంతగానో ఉపయోగపడతాయని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ అవకాశాన్ని అందరూ వినియోగించుకోవాలని ఆమె సూచించారు ఈ కార్యక్రమంలో మండల సర్వేరు సాల్మన్ రాజ్, ఆర్ ఐ కోటేశ్వరరావు, మాజీ సర్పంచ్ చింతపల్లి నన్ని, విఆర్వోలు గ్రామ నాయకులు రామిరెడ్డి మిల్లు బుడే నన్నేసాహెబ్ ఫారెస్ట్ అధికారులు రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# పేర్ని జయసుధ గోదాములో 4840 బస్తాల రేషన్ బియ్యం మాయం

(మొదటి పేజీ తరువాయి)

హాస్టల్స్ కు సరఫరా చేస్తాం.

**సాఫ్ట్ వేర్ అమలు చేస్తున్నామనగానే లేఖ రాశారు**

పౌరసరఫరాల శాఖలో సంస్కరణలు తీసుకురావాలని నవంబర్ 26న సివిల్ సప్లైస్ ఎండీ మనజీర్ "వేర్ హౌస్ మేనేజ్మెంట్ సిస్టమ్" అనే సాఫ్ట్ వేర్ తీసుకొచ్చారు. దీని ద్వారా ఏ గోడౌన్ లో ఎంత స్టాక్ ఉంది? ఏ గోడౌన్ లో ఎంత స్టాక్ భద్రపరచాలి? వచ్చే సీజన్ లో ఎంత వరకు ధాన్యం కొనుగోళ్లు చేయాలి? వంటి సమాచారం పొందుపరిచే విధంగా ఈ సాఫ్ట్ వేర్ రూపొందించారు. అదే రోజు గోడౌన్ యాజమానులకు, వాళ్ల మేనేజర్లు, పౌరసరఫరాల శాఖ అధికారులకు ఆన్ లైన్ లో ట్రైనింగ్ ఇచ్చారు. ఏ విధంగా తనిఖీలు చేసి ఆన్ లైన్ లో నమోదు చేయాలో శిక్షణ ఇచ్చారు. నవంబర్ 27వ తేదీన తమ గోదాముల్లో స్టాక్స్ తగ్గిందని, మూడు వేల బ్యాగుల రేషన్ బియ్యం షార్టేజి కనబడుతుందని వేబ్రిడ్జ్ లో పొరపాటు వల్ల ఇలా జరిగిందని జె.ఎస్. గోడౌన్ వారు లేఖ రాశారు. గోడౌన్ లో మాయమైన బియ్యానికి ఎంత విలువైతే అంత డబ్బులు చెల్లిస్తామని లేఖలో పేర్కొన్నారు.

**ముగ్గురు సభ్యులతో కమిటీ వేశాం**

ఆ లేఖ చూడగానే... అసలు జేఎస్ గోడౌన్స్ లో స్టాక్ ఎంతుంది..? అనే సమాచారాన్ని స్టాక్ రిజిస్టర్ బట్టి ప్రాథమిక సమాచారాన్ని జాయింట్ కలెక్టర్ నుంచి డిసెంబర్ 4వ తేదీన తెప్పించుకున్నాం. ప్రాథమిక సమాచారం బట్టి 3 వేల బస్తాలు కాదు 3708 బస్తాలు తగ్గాయని తెలిసింది. డిసెంబర్ 10న సివిల్ సప్లైస్ ఎండీ చట్టప్రకారం డబుల్ పెనాల్టీ వేయాలని, జేఎస్ గోడౌన్ ను బ్లాక్ లిస్టులో ఉంచాలని నిర్ణయించి, క్రిమినల్ చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. మాయమైన రేషన్ బియ్యంపై లోతైనా విచారణకు ఆర్డీవో, సివిల్ సప్లైస్ మేనేజర్, లీగల్ మెట్రాలజీ విభాగం నుంచి అసిస్టెంట్ కంట్రోలర్ తో కమిటీ వేశారు. జేఎస్ గోడౌన్ లో డిసెంబర్ 16వ తేదీన తనిఖీలు నిర్వహిస్తామని 13వ తేదీన నోటీసులు జారీ చేశాం. నోటీసులు జారీ చేసిన రోజే కోటి రూపాయల డీడీలను కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్ జేఎస్ యాజమాన్యం అందించింది. 16వ తేదీన సిబ్బంది తనిఖీలకు వెళ్లినా సహకరించలేదు. కనీసం ఎవరూ రాకపోవడంతో– పై అధికారుల అనుమతితో లాయర్ల సమక్షంలో పంచనామా చేశారు. పూర్తిస్థాయిలో విచారణ జరపడానికి అక్కడ ఉన్న స్టాక్ 4093 బస్తాలు మండల లెవల్ స్టాకింగ్ పాయింట్లకు తరలించారు. దీన్ని మొత్తం వీడియో కెమెరా ద్వారా చిత్రీకరించాం.

**రిజిస్టర్ ట్యాంపర్ చేసే ప్రయత్నం**

వేబ్రిడ్జ్ లో టెక్నికల్ ప్రాబ్లమ్ వల్ల పొరపాటున స్టాక్ తగ్గింది అని జేఎస్ యాజమాన్యం చెబుతోంది. వీళ్లు మరిచిపోయారో... లేక విచారణలో బయటకు రాదో అనుకుంటున్నారో పక్కనే ఉన్న సత్య వేర్ హౌస్ టెక్నికల్ ప్రాబ్లమ్ ఉందనిగానీ, స్టాక్ తగ్గిందని చెప్పలేదు. స్టాక్ రిజిస్టర్, లారీ వేబ్రిడ్జ్ ను ట్యాంపర్ చేసి ఆధారాలను ధ్వంసం చేయడానికి ప్రయత్నిస్తున్నారు. దీనిపై ఇప్పటికే ఎఫ్ఐఆర్ రిజిస్టర్ అయ్యింది. అందిన రిపోర్టు ప్రకారం 243 మెట్రిక్ టన్నులు అంటే 4840 బస్తాలు తగ్గాయని నిర్ధారణ అయ్యింది. నిబంధనల ప్రకారం 2 కోట్ల 23లక్షల 56వేల రూపాయలు చెల్లించారు. చాలా మంది సంబంధిత గోదాము యజమాని కుటుంబంపై ఎందుకు యాక్షన్ తీసుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు. చట్టం ముందు అందరూ సమానమే. ఎవరిపైనా కక్ష సాధింపు చర్యలు ఉండవు. తప్పు చేస్తే ఎవరూ తప్పించుకోలేదు. రూల్ ఆఫ్ లా ఇంప్లిమెంట్ కావాల్సిందే. జేఎస్ గోడౌన్ 2021లో పౌర సరఫరాల శాఖకు అప్పగించారు. అక్కడ సుమారు 5వేల మెట్రిక్ టన్నులు బియ్యాన్ని భద్రపరుస్తాం. అటువంటి గోడౌన్ లో 243 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని దారి మళ్లించారు. లెక్కలతో సబంధం లేకుండా ప్రజల సొమ్ము స్వలాభం కోసం దారి మళ్లించారు. కూటమి ప్రభుత్వం తరపున ప్రజలకు హామీ ఇస్తున్నాం. వందకు వందశాతం న్యాయం చేస్తాం. తప్పు చేసిన ఏ ఒక్కరినీ వదిలిపెట్టం. ప్రభుత్వ ఆస్తులు కాపాడుకునేలా మార్పు తీసుకొస్తామ"న్నారు.

## జమిలీకి టీడీపీ మద్దతు

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికల కమిషన్ ఖర్చు చేసినట్లు ముసాయిదా ఉందని వివరించారు. రెండు ఎన్నికలనూ ఒకేసారి నిర్వహిస్తే ఖర్చులు 40 శాతం తగ్గే అవకాశం ఉందని, దీంతోపాటు ఏడు శాతం వరకు ఓటింగ్ పెరుగుతుందని తెలిపారు.

**ఖర్చులు – విధులు**

దేశంలో రాజకీయ పార్టీలకు లక్ష కోట్లపైగా ఎన్నికల ఖర్చు అవుతుందని, ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం ద్వారా ఈ ఖర్చు కూడా తగ్గుతుందని వివరించారు. గత ఆరు నెలల్లో రాష్ట్ర స్థాయిలో మూడు ఎన్నికలు జరిగాయని, ఈ కారణంగా అధికార యంత్రాంగం రెగ్యులర్ విధులకు ఆటంకం కలుగుతుందని వివరిం చారు. విడతల వారీగా ఎన్నికలను నిర్వహిం చడం ద్వారా ఆ ప్రభావం దేశవ్యాప్తంగా ఉంటుందని పెమ్మసాని తెలిపారు.

## విషపు ఎరలతో లద్దె పురుగు నివారణ

**పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఏవో అరుణ**




**ముప్పాళ్ల, మేజర్ న్యూస్ :** మండలంలో దమ్మాలపాడు, తురకపాలెం గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం జరిగినది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అరుణ మాట్లాడుతూ మొక్కజొన్న పంటలో పొగాకు లద్దె పురుగు ఉద్ధృతి గమనించి పొగాకు లద్దె పురుగు నివారణ కొరకు విషపు ఎర్రలను వాడాలని సూచించారు. విషపు ఎరలను తయారు చేసుకునే విధానం ఒక లీటర్ మోనోక్రోటోపాస్ 10 కేజీల తవుడు రెండు కేజీల బెల్లం ఉండలుగా చేసుకొని పొలంలో చల్లవలెనని సూచించారు. వరి పంట ను కోసిన రైతులు రైతు సేవ కేంద్రాలలో నమోదు చేసుకొని క్వింటాల్ రూ 2320/- అనగా 75 కేజీ ల బస్తా రూ.1720/- అమ్ముకోవచ్చని తెలిపారు. అలాగే రబీ పంటకు గాను పంట నమోదు చేయడం జరుగుతుంది. మొక్కజొన్న, శెనగ, వేసిన రైతులు పంటను గవర్నమెంట్ మద్దతు ధరకు అమ్ముకోవాలన్న, వరి పంటల భీమా కింద నమోదు చేసుకోవాలన్న ఈ క్రాప తప్పనిసరి అని తెలియచేశారు. అలాగే ముఖ్యముగా దాళ్వా వరి వేసే రైతులు పంటల బీమా కొరకు ఎకరానికి రూ.630 చెల్లించి నమోదు చేసుకోవాలని తెలియచేశారు.

# కేంద్ర సాయంతో ప్రతిష్టాత్మక ఎయిమ్స్‌కు పునాది

(మొదటి పేజీ తరువాయి)

పరిజ్ఞానంపై వైద్య విద్యార్థులు పట్టు సాధించాలని, రోగులు తప్పనిసరి పరిస్థితుల్లో తప్ప ఆస్పత్రులు రాకుండా వైద్య చికిత్స అందించేలా వైద్యరంగాన్ని సాంకేతిక పరిజ్ఞానంతో తీర్చిదిద్దాలని చెప్పారు. మంగళవారం మంగళగిరి ఎయిమ్స్‌లో జరిగిన మొదటి స్నాతకోత్సవానికి హాజరైన ముఖ్యమంత్రి.. ఈ కార్యక్రమానికి హాజరుకావడం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. స్నాతకోత్సవానికి హాజరైన వైద్య విద్యార్థులు అందరికీ ముందుగా అభినందనలు తెలిపారు.

**రాష్ట్రపతి ముర్ము అందరికీ స్ఫూర్తి :**

ఒడిశాలోని ఒక మారుమూల గ్రామంలోని గిరిజన కుటుంబం నుంచి రాష్ట్రప్రతి ద్రౌపది ముర్ము వచ్చారని, రాష్ట్రపతి స్థాయి వరకు ఎదగడం అందరికీ స్ఫూర్తిదాయకమని ముఖ్యమంత్రి కొనియాడారు. ఉపాధ్యాయురాలిగా ప్రస్థానాన్ని మొదలుపెట్టిన ఆమె ప్రొఫెసర్‌గా, జూనియర్ అసిస్టెంట్‌గా, కౌన్సిలర్‌గా, చైర్‌పర్సన్‌గా, ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా, గవర్నర్‌గా.. ఇలా పలు బాధ్యతలు నిర్వర్తించారని.. దేశానికి ప్రథమ పౌరురాలు అయ్యారని..అంతే పట్టుదలగా కష్టపడితే ఎవరైనా ఉన్నత స్థానానికి చేరుకోవచ్చని రాష్ట్రపతి నిరూపించారని ముఖ్యమంత్రి అన్నారు.

**ఎయిమ్స్‌కు సంపూర్ణ సహకారం :**

మంగళగిరి ఎయిమ్స్‌కు దేశంలో మరే ఎయిమ్స్‌కు లేనట్టుగా 183 ఎకరాల భూమి ఇచ్చామని, అదికూడా అత్యుత్తమ ప్రాంతాన్ని ఎంపిక చేసి కేటాయించామని ముఖ్యమంత్రి చెప్పారు. భవిష్యత్ అవసరాల కోసం మరింత భూమిని ఇవ్వాల్సిందిగా ఇటీవల ఎయిమ్స్ అధికార వర్గాలు తనను కోరాయని, త్వరలోనే మరో 10 ఎకరాలు ఎయిమ్స్‌కు కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నామని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ప్రకటించారు. 2018లో తమ ప్రభుత్వ హయాంలోనే ఎయిమ్స్‌కు శంకుస్థాపన చేశామని, 960 బెడ్లతో రూ.1618 కోట్లతో దీనిని నిర్మించారని.. 9 ఏళ్లలో గుర్తింపు తెచ్చుకోవడం ఆనందదాయకమని చెప్పారు. ఎయిమ్స్‌కు అప్రోచ్ రోడ్లు, జాతీయ రహదారితో అనుసంధానించడం, విద్యుత్ సరఫరా, నీటి సరఫరా వంటి మౌలిక సదుపాయాలు రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందని, భవిష్యత్‌లో మరింతగా సహాయ సహకారాలు అందించేందకు సిద్ధంగా ఉన్నామని ముఖ్యమంత్రి అన్నారు. మంగళగిరి ఎయిమ్స్‌లో రోగులకు రూ.10కే వైద్య సేవలు అందించడాన్ని ఆయన అభినందించారు. మంగళగిరి ఎయిమ్స్ ప్రస్తుతం ర్యాకింగ్‌లో దేశంలో 8వ స్థానంలో ఉందని, త్వరలోనే మొదటి స్థానంలో ఉండాలనేది తన ఆకాంక్షని చెప్పారు.

**కేంద్రం ఎంతో అండగా ఉంది**

ఎయిమ్స్, ఐఐటీ, ఐఐఎం, గిరిజన విశ్వవిద్యాలయం, సెంట్రల్ యూనివర్సిటీ సహా పలు కేంద్ర విద్యా సంస్థలను కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో ఏర్పాటు చేసినందుకు ప్రధాని నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి కృతజ్ఞతలు తెలిపారు. అమరావతి నగరాన్ని వచ్చే మూడేళ్లలో దాదాపు రూ. 50 వేల కోట్లు ఖర్చు చేసి అత్యద్భుతంగా నిర్మిస్తామని చెప్పారు. ఎయిమ్స్ స్నాతకోత్సవ కార్యక్రమానికి హాజరవడానికి ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రానికి వచ్చిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్‌తో కలిసి గన్నవరం విమానాశ్రయంలో స్వాగతం పలికారు.

## మంత్రి లోకేశ్‌ను కలిసిన నరసరావుపేట ఎమ్మెల్యే



**నరసరావుపేట, మేజర్ న్యూస్ :** రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌ను అమరావతిలో నరసరావుపేట ఎమ్మెల్యే డా.చదలవాడ అరవింద బాబు మంగళవారం కలిసి అభినందించారు.రాష్ట్రంలో పలు సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకుంటున్న నిర్ణయాలను ప్రజలందరూ హర్షిస్తున్నారని లోకేశ్‌కు వివరించారు.విద్య,ఐటీ మంత్రిగా రాష్ట్రాన్ని స్వర్ణయుగం వైపు పయనించేందుకు కృషి చేస్తున్నందుకు లోకేశ్‌ను అభినందించారు. జాతీయ రహదారి ప్రతిపాదించిన ఎలైన్ మెంట్మార్పుచేయాలంటూ ప్రభావిత ప్రజలు ఎమ్మెల్యే అరవిందబాబుతో కలసివచ్చి లోకేష్ వినతి పత్రం అందజేశారుచీరాల ఓడరేవు నుంచి నకరికల్లు వరకు 167ఎ 4లైన్ల జాతీయ రహదారిని ఎన్ హెచ్ఎఐ అధికారులు 2022లో ప్రతిపాదించారు.ఇందులో అంతర్భాగంగా ఉన్న నరసరావుపేట బైపాస్ నిర్మాణానికి 3 ఆప్షన్లు ఇచ్చారు.ఇందులో నరసరావుపేట దక్షిణం వైపు బైపాస్ కు ప్రతిపాదించిన ఆప్షన్ –3 వల్ల 5 గ్రామాల ప్రజలు పెద్దఎత్తున రైతులు నష్టపోవాల్సి వస్తుందన్నారు.రైతులకు తక్కువ నష్టం కలిగించే ఆప్షన్ –2ను అమలు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే డా.చదలవాడ అరవింద బాబు నేతృత్వంలో మంత్రి లోకేష్ ను కలిసి విన్నవించారు

## అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన పల్నాడు కలెక్టర్



**నరసరావుపేట, మేజర్ న్యూస్ :** పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు నరసరావుపేట మండలం పెద్దిరెడ్డి గ్రామంలోని ప్రైమరీ స్కూల్ , అంగన్వాడి కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారం మరియు బోధన విధానం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు మధ్యాహ్న భోజన పథకాన్ని అందిస్తున్నారా వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ అధికారి మధులత, మండల రెవిన్యూ అధికారి వేణుగోపాలరావు, ఐసిడిఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్సై : సంధ్యారాణి



**మాచర్ల ప్రతినిధి మేజర్ న్యూస్ :** మాచర్ల పట్టణంలోని రింగ్ రోడ్ సెంటర్ నందు పట్టణ ఎస్ఐ సంధ్యారాణి ద్విచక్ర వాహనాలు తనిఖీ నిర్వహించారు. అందులో భాగంగా లైసెన్సులు లేని వాళ్లను, హెల్మెట్ లేని వాళ్లను, త్రిబుల్ రైడింగ్ చేసేవారిని గుర్తించి జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సంధ్యారాణి మాట్లాడుతూ తప్పనిసరిగా వాహనదారులు వాహన పత్రాలు, ఇన్సూరెన్స్ పత్రాలు కలిగి ఉండాలని, హెల్మెట్ ధరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆక్స్ఫర్డ్ లో ఉల్లాసంగా ఉత్సాహంగా 26వ క్రీడా దినోత్సవం

గుంటూరు మేజర్ న్యూస్ :

గుంటూరు నగరంలోని ప్రముఖ విద్యా సంస్థ అయినటువంటి ఆక్స్ఫర్డ్ స్కూల్ యాజమాన్యం వారు 26వ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో ఘనంగా నిర్వహించారు. ఈ క్రీడా దినోత్సవం లో ఏటి అగ్రహారం, ఎస్ వి ఎన్ కాలనీ, గోరంట్ల నగరాలు వంటి ప్రదేశాలలో ఉన్న ఆక్స్ఫర్డ్ స్కూల్ బ్రాంచ్లకు చెందిన విద్యార్థులు ఈ క్రీడావోత్సవంలో పాల్గొన్నారు. ఈ క్రీడా దినోత్సవాన్ని ఏటి అగ్రహారం బ్రాంచ్ వారు ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. ముందుగా ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పాఠశాల వ్యవస్థాపకులైన




విదుషన్ శ్రీయస్ ఫ్రాన్సిస్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా ఎంతో ముఖ్యమని, మనిషి శారీరక, మానసిక వికాసానికి క్రీడలు దోహదపడతాయని వివరించారు. క్రీడలలో భాగంగా లాంగ్ జంప్, హై జంప్, షాట్ పుట్, పరుగు పందెం వంటి పోటీలు నిర్వహించి గెలుపొందిన విజేతలకు బహుమతి ప్రధానంతో పాటు మెడల్స్ తో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలకు చెందిన డైరెక్టర్ ప్రిన్సిపల్స్ బోధన బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు విద్యార్థుల తల్లిదండ్రులకు, పెద్దలకు స్థానిక ఏటి అగ్రహారం ఆక్స్ఫర్డ్ ప్రధానోపాధ్యాయురాలు సీతామాలక్ష్మికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.




# ఘనంగా చంద్ర రాజ కుమారి వర్ధంతి వేడుకలు

**పెదకాకాని, మేజర్ న్యూస్ :-**

జిల్లా మహిళా సమైక్య ఆధ్వర్యంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శి స్వర్గీయ చంద్ర రాజకుమారి 6వ,వర్ధంతి సందర్భంగా మంగళవారం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు, ఈ సందర్భంగా గుంటూరు జిల్లా మహిళా సమైక్య కార్యదర్శి రెంటాల కుమారి మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తూ మహిళల అభ్యున్నతి సాధికారిత కోసం అనేక పోరాటాలు సాగించారన్నారు. మహిళలు వంటింటికి పరిమితం కాకుండా ఉన్నత విద్యలు అభ్యసించి ఉద్యోగ రాజకీయా లలో రాణించలన్నారని, చట్ట సభలలో మహి ళలకు 33% రిజర్వేషన్లు కల్పించాలని అనేక పోరాటాలు కొనసాగించారన్నారు. ఆమె పోరాట స్ఫూర్తిని మహిళా లోకం ఆదర్శంగా తీసుకొని ఆమె ఆశయాల సాధన కోసం నిరంతరం పోరాటాలు కొనసాగించడమే ఘనమైన నివాళి అర్పించటం అన్నారు. కార్యక్రమంలో సిహెచ్ విజయలక్ష్మి,గంగ,సంధ్య, ముత్యాలమ్మ,సుమతి, కమలమ్మ, దివ్య, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.



# దుగ్గిరాల డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్గా గౌర్నెని అనిల్ కుమార్

**దుగ్గిరాల, మేజర్ న్యూస్ :**



దుగ్గిరాల, మండలం డిసి పరిధిలోని రైతులు ఇబ్బంది పడకుండా సాయి శక్తుల రైతుల అభ్యున్నతి కోసం కృషి చేస్తానని నూతనముగా డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్గా ఎంపికైన జి .అనిల్ కుమార్ తెలిపారు. తన ఏకగ్రీవ ఎంపికకు సహకరించిన ప్రతి ఒక్క డబ్ల్యు ప్రెసిడెంట్ లకు ధన్యవాదాలు తెలిపారు. డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్గా ఎంపికైన అనిల్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఎకరాకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తానని రైతుల సంక్షేమం కోసం పాటుపడతానని డిసి చైర్మన్ అనిల్ కుమార్ తెలిపారు. నా ఎంపికకు సహకరించిన కూటమి పార్టీ నాయకులు గూడూరు వెంకటరావు, వెనిగళ్ళ శ్రీకృష్ణ ప్రసాద్, పుతుం బాక సాయి కృష్ణ ,కొండపనేని చటర్జీ చౌదరి పసుపులేటి శ్రీనివాసరావు కన్నెగంటి, సాంబశివరావులకు ధన్యవాదములు తెలిపారు.

# దుగ్గిరాల నీటి సంఘ అధ్యక్ష ఉపాధ్యక్ష నియామకాల ఏకగ్రీవం



**దుగ్గిరాల, మేజర్ న్యూస్ :**

దుగ్గిరాల జల వనరుల శాఖ కార్యాలయం నందు మంగళవారం నీటి సంఘాల చైర్మన్ వైస్ చైర్మన్ నియామకాలు ఏకగ్రీవం అయ్యాయి .మొత్తం ఎనిమిది మంది సభ్యులకు గాను చైర్మన్గా మోరంపూడికి చెందిన గౌర్నేని అనిల్ కుమార్ వైస్ చైర్మన్గా చినపాలెం కు చెందిన విసరపు శేషగిరిరావు లు ఏకగ్రీవంగా ఎన్నికైనారు.ఈ మని , తుమ్మపూడి, పెద కొండూరు ,గుండె మెడ అత్తోట ,గ్రామాలకు చెందిన నీటి సంఘం అధ్యక్షులు డైరెక్టర్లుగా నియామకం అయ్యారు. ముందుగా కార్యాలయంలో ఎన్నికల అధికారి గడ్డం ముత్యం బాబు సమక్షంలో సంతకాలను చేయగా పత్రాలను అందజేశారు .అనంతరం నూతనంగా ఎన్నికైన చైర్మన్ వైస్ చైర్మన్ లను డైరెక్టర్లు పూలమాలలు వేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. పేరుకులపూడి నీటి సంఘం అధ్యక్షులు గోగం నాగేశ్వరరావు, ఈ మని నీటి సంఘం అధ్యక్షులు మాగం వంశీకృష్ణ, తుమ్మ పూడి నీటి సంఘం అధ్యక్షులు న.డ్రా శివప్రసాద్ ,కంఠం రాజు కొండూరు నీటి సంఘ అధ్యక్షుడు తా.డిబోయిన నాగేశ్వరరావు, చిలువూరు నీటి సంఘ అధ్యక్షులు ఆలపాటి రామారావు, పెనుమూలి నీటి సంఘం అధ్యక్షులు కొరిటాల భాస్కర్ తో పాటు కూటమి నాయకులు గూడూరు వెంకటరావు, పసుపులేటి శ్రీనివాసరావు, వెని గళ్ళ శ్రీకృష్ణ ప్రసాద్, కొండపనేని చటర్జీ చౌదరి కే.సంనేని వాసు బాబు గద్దె వాసు, పు తుంబాక. సాయి కృష్ణ, టి. అశోక్ కన్నెగంటి సాంబశివ రావు, చంటి శ్రీనివాస్, శివయ్య, కె.కృష్ణలతో పాటు ఇరిగేషన్ ఏఈ లక్ష్మీనారాయణ సిబ్బంది పార్టీల కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రెండు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం

**నూజెండ్ల మేజర్ న్యూస్:**

మండలంలోని వ్యవసాయ మరియు అనుబంధ శాఖల ఆధ్వర్యంలో ఐనవోలు, పాతచేరుకుంపాలెం గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంను మండల వ్యవసాయ అధికారిణి సుగుణా బేగం షేక్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కంది, వరి,మిరప పంటలను క్షేత్ర సందర్శన చేసి, రైతులతో రైతు సేవా కేంద్రాలు వద్ద సమావేశం నిర్వహించారు.

ఏవో మాట్లాడుతూ కంది పంటలో మారుకా మచ్చల పురుగు ఉధృతి ఉన్నట్లు గమనించారు. లేత ఆకులు, పూత, పిందెలను గూడుగా చేసుకొని అందులోనేఉంటూ నష్టాన్ని కలుగజేస్తుందని వివరించారు. రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు జి.మణికంఠ, రైతులు తదితరులు పాల్గొన్నారు.



# 4.7 వేల లీ. బెల్లపు ఊట ధ్వంసం

- ఎక్సైజ్ సీఐ వెంకటరమణ



**వెల్దుర్తి ప్రతినిధి, మేజర్ న్యూస్ :**

పల్నాడు జిల్లా, వెల్దుర్తి మండలం లోని గుండ్లపాడు గ్రామం నందు విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ డిపార్ట్మెంట్ అధికారులు ఆకస్మిక తనిఖీలు జరిపారు. ఈ నేపథ్యంలో గుండ్లపాడు గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో కొందరు స్థానికులు నిషేధిత నాటు సారాను తయారు చేస్తున్నట్లుగా గుర్తించి ఘటనా స్థలంలోని 4700 లీ.ల బెల్లపు ఊటను ఎక్సైజ్ డిపార్ట్మెంట్ అధికారులు ధ్వంసం చేశారు. ఈ ఆకస్మిక తనిఖీలలో మాచర్ల సిబ్బంది, ఎస్టీఎఫ్ విజయవాడ, ఎన్ఫోర్స్మెంట్ గుంటూరు, ఈ ఎస్ టి ఎఫ్ నరసరావుపేట, పిడుగురాళ్ల మరియు గురజాల ఎక్సైజ్ డిపార్ట్మెంట్ అధికారులు కలిసికట్టుగా తనిఖీలు పూర్తి చేసినట్లు మాచర్ల ఎక్సైజ్ సీఐ ఎన్ వెంకట రమణ తెలియజేశారు. అదేవిధంగా నిషేధిత నాటు సారా మరియు ఇతర రాష్ట్రాల నుండి అక్రమంగా తరలించిన మద్యం విక్రయిస్తున్న వారి వివరాలు తెలపాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని అన్నారు.

## రెవెన్యూ సదస్సులను వినియోగించుకోండి - ఎమ్మార్వో షేక్ బాషా

**వెల్దుర్తి ప్రతినిధి, మేజర్ న్యూస్ :**



పల్నాడు జిల్లా, వెల్దుర్తి మండలం, శ్రీరాంపురం తండాలో మంగళవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా వెల్దుర్తి మండల తాసిల్దార్ షేక్ బాషా మాట్లాడుతూ రైతులు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను వినియోగించుకుని భూ సర్వేలను, భూ వివాదాలను పరిష్కరించుకోవాలని అన్నారు. అదేవిధంగా దరఖాస్తు చేసుకున్న వారికి 45 రోజులనే సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వెల్దుర్తి మండల రెవెన్యూ సిబ్బంది, గ్రామ పెద్దలు, కూటమి నాయకులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పారిశుధ్య నిర్వహణపై మంత్రి నాదెండ్ల ఆగ్రహం

**తెనాలి, మేజర్ న్యూస్**



స్థానిక బోస్ రోడ్డు లో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను మంత్రి నాదెండ్ల మనోహర్ మంగళవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. మంత్రితోపాటు గా మున్సిపల్ అధికారులను జరుగుతున్న రోడ్డు విస్తరణ గురించి, నాణ్యత ప్రామాణాల గురించి మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రోడ్డుపై ఉన్న చెత్తను అక్కడి పరిసరాలను పరిశీలించిన మంత్రి శానిటేషన్ అధికారులపై ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. పారిశుధ్య నిర్వహణలో సంబంధిత అధికారులు అలసత్వం ప్రదర్శించడంపై అసహనం వ్యక్తం చేశారు. ఆ ప్రాంతంలోని ఒక హోటల్ వద్ద రోడ్డుపై పార్కింగ్ చేసిన వాహనాలను చూసి మంత్రి నాదెండ్ల వన్ టౌన్ సిఐ ని పిలిచి ప్రజలకు ఇబ్బంది కలిగే విధంగా పట్నంలో ఎక్కడ రోడ్లపై వాహనాలు పార్కింగ్ పై పలు సూచనలు అందించారు. మంత్రి నాదెండ్ల వెంట మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి, హెల్త్ ఆఫీసర్ నిర్మల హెలెన్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## పల్నాడు జిల్లా ఎస్పీని కలిసిన ఫైనాన్స్ అసోసియేషన్

**పిడుగురాళ్ల, మేజర్ న్యూస్ :**



పిడుగురాళ్ల , కారంపూడి ప్రవేట్ ఫైనాన్స్ అసోసియేషన్ కమిటీ సభ్యులు అందరూ కలిసి సోమవారం నరస రావుపేట లోని ఎస్పీ కార్యాలయంలో ఎస్పీని కలిసి ప్రస్తుతం పల్నాడు జిల్లా ఫైనాన్స్ వారు ఎదుర్కొంటున్న వాహనాల అనధికార తాకట్టు సమస్యల గురించి ఎస్పీ కి విన్నవించుకొని వినతి పత్రం అందజేశారు. అనంతరం ఎస్పీ సమస్యలకు సానుకూలంగా స్పందించి ఫైనాన్సర్స్ వారికి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారని కమిటీ వారు తెలిపారు. ఈ సందర్భంగా పల్నాడు జిల్లా ఎస్పీ కి కృతజ్ఞతలు కమిటీ వారు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హాజరైన పిడుగురాళ్ల, కారంపూడి ఆటో ఫైనాన్షియర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మిత్రులందరికీ ఫైనాన్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జూలకంటి సురేష్ , సెక్రెటరీ శేగు సురేష్ , ట్రెజరర్ కొనకొండ్ల జ్ఞానేశ్వరరావు అభినందనతో ధన్యవాదములు తెలిపారు.

## రెవెన్యూ సదస్సులో సమస్యలను మాట్లాడిన బొప్పూడి శీను

**బొల్లాపల్లి, మేజర్ న్యూస్ :**

బొల్లాపల్లి మండల మాజీ తెలుగు యువత అధ్యక్షులు బొప్పూడి శ్రీనివాస్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులు జరపటం మాకు ఎంతో ఆనంద దాయకంగా ఉందని ఇలాంటి కొత్త వాటికి శ్రీకారం చుట్టాలి అంటే తెలుగుదేశం పార్టీతోనే నారా చంద్రబాబు నాయుడుకి సాధ్యమని పేర్కొన్నారు ఈ కార్యక్ర మంలో యూనిట్ ఇంచార్జ్ గంగనేని రమణయ్య సీనియర్ నాయకులు కాసర్ల గోవిందరాజులు మాజీ గ్రామ పార్టీ అధ్యక్షులు రాచపల్లి ఏడు కొండలు అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి రావురి. నరసింహారావు వెంకట కోటయ్య బీసీ నాయకులు తొర్లకొండ శ్రీనివాసరావు డీలర్లు రహీం తొర్లకొండ వెంకయ్య 38 బూత్ ఇంచార్జ్ పిట్టల గోవిందు ఎస్టి నాయకులు మూడవత్ శీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# పసుపు బాండ్లను తనిఖీ చేపట్టిన బీమా సంస్థ బృందం

దుగ్గిరాల, మేజర్ న్యూస్ .కోట్లాది రూపాయల విలువ చేసే . పసుపును కోల్డ్ స్టోరేజీ.లో నిల్వచేసిన రైతుల ఆస్తి బొగ్గుమన్న ప్రమాదంలో నష్టపోయిన రైతులకు సంబంధించిన బాండ్లను బీమా సంస్థ బృందం దుగ్గిరాల యార్డులో తనిఖీలను చేపట్టారు. దుగ్గిరాల రైలు పేటలో శుభం కోల్డ్ స్టోరేజీలో జనవరి 19న జరిగిన అగ్నిప్రమాదంలో లక్షలాది రూపాయల నష్టపోయిన రైతులకు సంబంధించిన బాండ్లను భీమా సంస్థ అధికారులు మంగళవారం పరిశీలిస్తున్నారు. నష్టపోయిన రైతులకు రైతు సంఘాలు వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా రాస్తారోకాలు. నిర్వహించి రైతుల పక్షాన నిలబడ్డారు . పసుపు ను శుభం కోల్డ్ స్టోరేజ్ లో నిలువచేసిన సుమారు 400 మందికి పైగా రైతులకు సంబంధించిన పసుపు నిలవలపై కోట్లాది రూపాయల పరిహారం అందించే క్రమంలో భాగంగా ఇండియా ఇన్సూరెన్స్ సంస్థకు సంబంధించిన అధికారులు రైతులు వద్దనున్న బాండ్లను పరిశీలించేందుకు సంస్థ ప్రతినిధి జుబేర్ అలీఖాన్ సిబ్బందితో కలిసి బాండ్లను తనిఖీ చేస్తున్నారు. అర్హులైన రైతులను గుర్తించి నివేదికను ప్రభుత్వానికి బీమా సంస్థ



అందజేయనున్నట్లు తెలుస్తుంది .తొలి రోజు.సోమవారం నాడు రైతు సంఘం నాయకులు జొన్న శివశంకర్ హాజరు కాగా రెండవ రోజు బాపట్ల జిల్లా రైతు సంఘం నాయకులు వి. వెంకటరామయ్య ,యం .శివసామిరెడ్డి ,జె.ట్టి బాల రాజులు యార్డుకు వచ్చి రైతుల వద్ద నుంచి బాండ్లను పరిశీలన చేసి వివరాలను బాండ్ భీమా సంస్థ అధికారులకు వివరాలను అందజేశారు.. కాగా స్టోరేజ్లో నిలువబెట్టి లక్షలాది రూపాయల విలువ చేసే పసుపు. అగ్నికి దగ్ధమైన సంఘటనలో ఇప్పటికైనా నష్టపరిహారం అందుతుందన్న గంపెడంత ఆశతో నష్టపోయిన రైతులు బీమా సంస్థ అధికారులు వద్దకు రావడం విశేషం.

# రెవెన్యూ సదస్సులు నిర్వహించడం అభినందనీయం - దేశవత్ మల్లయ్య నాయక్

**వెల్దుర్తి ప్రతినిధి, మేజర్ న్యూస్ :**



పల్నాడు జిల్లా, వెల్దుర్తి మండలం, శ్రీరాంపురం తండా నందు రెవెన్యూ సదస్సులు నిర్వహించడం పట్ల శ్రీరాంపురం తండా తెదేపా సీనియర్ నాయకులు దేశావత్ మల్లయ్య నాయక్ కూటమి ప్రభుత్వానికి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ గ్రామంలో భూ సమస్యలను పరిష్కరించుకునేందుకు రెవెన్యూ సదస్సులు ఎంతగానో ఉపయోగపడుతున్నా యని ఆయన అభిప్రాయపడ్డారు. రైతుల భూముల రికార్డులలో ఉన్న తప్పులను సరి చేసుకోవడం రెవెన్యూ సదస్సుల ముఖ్య ఉద్దేశం అని ఆయన అన్నారు. గ్రామ ప్రజలు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాల్సిందిగా ఆయన కోరారు. ఈ సదస్సులలో దరఖాస్తు చేసుకోవడం ద్వారా 45 రోజులలోనే సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని గ్రామస్తులకు తెలియజేశారు.

# పోరాట యోధురాలు.. ఈ మహిళ

**పెదకాకాని, మేజర్ న్యూస్:**

పెదకాకాని గ్రామానికి చెందిన మలినేని రుక్మిణి ఎన్నో పోరాటాలు చేసి.., పోరాట యోధురాలుగా నిలిచారు. ఈమె 10వ, తరగతి వరకు చదివి అనంతరం ఎన్నో ఉద్యమాలలో పాల్గొని, పోరాటాలు చేశారు. కమ్యూనిస్టు పార్టీలో (ఎంఎల్ ) 10 సంవత్సరాల పాటు అనేక ఉద్యమాలలో పాల్గొన్నారు. సారా నిషేధ ఉద్యమాలలో క్రియాశీలక పాత్ర పోషించారు. అంతేకాకుండా రాజకీయా లలో మహిళలు పాల్గొనేలా చైతన్యవంత మైన కృషి చేశారు. సామాజిక సేవలో భాగంగా మహిళలకు కుట్టు మిషన్ ల పనిలో తర్ఫీదు ఇప్పించారు. గ్రామ, మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో ప్రజా సమస్యలపై స్పందించి అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి అధికారులతో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. మహిళల పలు సమస్యలను,సామాజిక సమస్యలను గమనించి అవగాహనతో వాటిని మహిళలతో కలిసి పనిచేశారు. అనంతరం నారా చంద్రబాబు నాయుడు స్ఫూర్తితో 2000 సంవత్సరంలో తెలుగుదేశం పార్టీలోకి వచ్చారు. అప్పటినుండి ఇప్పటివరకు 24 సంవత్సరాలుగా పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ, అనేక ఉద్యమాలలో పాల్గొని, అనేక కేసుల్లో పోలీసులు అరెస్టు చేశారు. అధికారంలో ఉన్నా లేకున్నా పార్టీ బలోపేతానికి తన వంతు అహర్నిశలు కృషి చేశారు. మహిళా కార్యకర్తలతో పాటు, అన్ని వర్గాల ప్రజలను చైతన్యవంతులుగా చేసి పార్టీ వైపు నడిపించడంలో సఫలమయ్యారు. ముఖ్యంగా 2019 నుంచి 2024 వరకు అమరావతి రాజధాని ఉద్యమంలో కీలకపాత్ర పోషించారు. పార్టీ చేపట్టిన ప్రతి ఉద్యమంలో పాల్గొని విజయ వంతానికి కృషి చేశారు. పార్టీ పెద్దల ఆశీస్సులతో జిల్లా ఉపాధ్యక్షురాలుగా, జిల్లా ప్రధాన కార్యదర్శిగా సమర్థవం తంగా పనిచేశారు. ప్రస్తుతం రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శిగా కొనసాగు తున్నారు. 2024 ఎన్నికల్లో గుంటూరు ఎంపీ, పొన్నూరు నియోజక వర్గ ఎమ్మెల్యేల విజయాలకు అన్ని నియోజక వర్గం లోని మహిళా క్యాడర్ లతో కలిసి పార్టీ విజయానికి తన వంతు కృషి చేశారు. 2010 సం.అరండల్ పేటలో,2011, 2022 సం. పెదకాకాని పోలీస్ స్టేషన్లో రెండు , 2020 సం. మంగళగిరిలో రెండు, 2023 సం. పొన్నూరులో ఒకటి కేసులు ఉద్యమాల్లో పాల్గొన్నందుకు అప్పట్లో పోలీసులు అరెస్టు చేసిన చేశారు. ఎన్నో ఉద్యమాల్లో పాల్గొని పార్టీ విజయానికి కృషిచేసిన ఇటువంటి మహిళలకు పార్టీలో గుర్తింపు ఉన్న పదవి ఇచ్చి గౌరవించాలని మహిళలు కోరుతున్నారు.



# పొలం పిలుస్తుంది : సర్పంచ్ నరేష్



**మాచవరం, మేజర్ న్యూస్:**

మాచవరం మండలంలోని మాచవరం గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వ ర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్య క్రమంలో భాగంగా గ్రామ సచివాలయంలో సర్పంచి రాగిడి నరేష్ అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభలో పాల్గొన్న బి.శ్రీ కృష్ణదేవరాయలు, సహాయ వ్యవ సాయ సంచాలకులు, పిడుగురాళ్ళ, మాట్లాడుతూ పత్తి పంట పూర్తయిన వారు పొలాలను ఖాళీగా ఉంచకుండా జొన్న, మొక్కజొన్న పంటలను వేసుకోవాలి. రబీ-2024 వరి పంట వేసిన రైతులు 630 రూపాయలు రైతు వాటా చెల్లించి 31 డిసెంబర్ లోగా తమ పంటకు బీమా చేసుకోవాలని తెలిపారు. కంది, మిరప పంటలలో పూత రాలుతున్నట్లయితే 19-19-19 లేదా 13-0-45 ఎకరానికి కేజీ చొప్పున పిచికారి చేయాలని తెలిపారు. కొమ్మ ఎండు తెగులు, కాయ తొలుచు పురుగు నివారణ చర్యలను రైతులకు వివరించారు. వరి, ప్రత్తి పంటలను మద్దతు ధరకు రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకో వాలని తెలిపారు. ఈ కార్యక్రమములో మాచవరం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ రాగిడి నరేష్ మండల వ్యవసాయ అధికారిణి కే. రమమ్మ, గ్రామ నాయకులు రైతులు పాల్గొన్నారు.

# పెన్షన్ విశ్రాంత ఉద్యోగుల కుటుంబానికి కవచం అన్న చీఫ్ విప్ జీవీ






**వినుకొండ, మేజర్ న్యూస్:**

వినుకొండలో పెన్షనర్ల దినోత్సవంలో పాల్గొన్న చీఫ్ విప్ జీవీ, మక్కెన ప్రతిఒక్క విశ్రాంత ఉద్యోగి కుటుంబానికి పింఛను రక్షణకవచం లాంటిదన్నారు ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు. రాష్ట్ర ప్రభుత్వం తరపున పెన్షనర్ల సమస్యలకు సంబంధించి ముఖ్యమంత్రి చంద్రబాబుతో మాట్లాడి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించే ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు. మంగళవారం వినుకొండ నరసరావుపేట రోడ్డులోని విశ్రాంత ఉద్యోగుల సేవా సంఘం భవనంలో పెన్షనర్ల దినోత్సవాన్ని నిర్వహిం చారు. ఆ కార్యక్రమంలో ప్రభుత్వ జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు పాల్గొన్నారు. పెన్షనర్ల ఆరాధ్యదైవం డీఎస్ నకరా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చీఫ్ విప్ జీవీ ఆంజనేయులును పెన్షనర్లు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన చీఫ్ విప్ జీవీ ఎన్నికల్లో పెన్షనర్లకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకుంటామ న్నారు. కొంత సమయం తీసుకుని పెండింగ్లో ఉన్న 4 డీఏలు ఇవ్వాలని సీఎం చంద్రబాబును కోరతానని చెప్పారు. బకాయిలన్నీ వచ్చేలా కృషి చేస్తామన్నారు. జగన్‌రెడ్డి తగ్గించిన పెన్షన్‌ను మళ్లీ యథాతథంగా పెంచి ఇవ్వాలని సీఎం చంద్రబాబును కోరతానని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు అందరికీ పింఛను హక్కుగా రావడానికి కారకులైన డీఎస్ నకరాను స్మరించుకుంటూ ఘననివాళులు అర్పిస్తున్నట్లు చెప్పారు.

వినుకొండలో పెన్షనర్స్ మంచి భవనాన్ని నిర్మించుకుని, చక్కగా సేవా కార్యక్రమాలు చేస్తున్నందుకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఏటా సేవా కార్యక్రమాలు చేస్తున్నారని, గతంలో అనేకసార్లు తాను కూడా పాల్గొనడం జరిగిందన్నారు. సేవాభావంతో అన్నదాన కార్యక్రమాలు చేయడం, పిల్లలకు పుస్తకాలు పంపిణీ చేయడం లాంటివి చాలా నచ్చిన అంశమన్నారు. పెన్షన్లు రాని, కష్టాల్లో ఉన్నవారిపై మూలిగే నక్కపై తాటికాయ పడినట్లుగా జగన్‌రెడ్డి పాలన రావడం జరిగిందన్నారు. పెన్షనర్లకు మేలు చేయకపోగా కీడు చేసిన వ్యక్తి జగన్‌రెడ్డి అని, జీవితాంతం గుర్తుపెట్టుకోవాలని, గుర్తుపెట్టుకోవడమే కాదు, ఇలాంటి దుర్మార్గుల గురించి ఇంటింటికీ బతికున్నంత కాలం చెప్పాలి అన్నారు.

# ధనుర్మాసం ప్రారంభం సందర్భంగా రామచంద్రస్వామి గుడిలో ప్రత్యేక పూజలు



**వినుకొండ, మేజర్ న్యూస్:**

ధనుర్మాసం ప్రారంభం సందర్భంగా రామచంద్రస్వామి జన్మ నక్షత్రం , పునర్వసు నక్షత్రం ను పురస్కరించుకుని వినుకొండ పాత మార్కెట్ వద్ద వేంచేసి ఉన్న 800 సంవత్సరాల పురాతన చరిత్ర గలిగిన శ్రీ కోదండరామ స్వామి దేవస్థానంలో ఈరోజు విశేష అభిషేకం, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని శ్రీరామచంద్రస్వామి కల్యాణం కళ్యాణ వేద పండితులచే కనుల పండగగా అంగరంగ వైభవంగా కళ్యాణ మహోత్సవాన్ని అద్భుతంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక అర్చకులు నారాయన రామమోహన చార్యులు తనయులు నారాయణ శశాంకు చార్యులు ఆధ్వర్యంలో ఆలయంలో నిర్వహించబడుతున్న ఈ పూజలు ఎంతో విశేషం మైనవని, ఇటువంటి పూజల్లో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లోక కళ్యాణార్థం లో భాగంగా జరుగుతున్న ఈ కళ్యాణ మహోత్సవంలో ప్రత్యక్షంగా పరోక్షంగా పాల్గొన్న భక్తులకు భోగభా గ్యాలతో పాటు అష్టైశ్వర్యాలు సిద్ధిస్తయ్యి అన్నారు. అవివాహితులైన యువతి యువకులు కల్యాణంలోలో పాల్గొన్న శీఘ్రమే కల్యాణ ప్రాప్తి సిద్ధిస్తుంది. అన్నారు కార్యక్రమంలో ఈవో కొల్లి హనుమంతరావు లింగ శివ ఆలయ అభివృద్ధి కమిటీ కొల్లిపర బాలసుబ్రమణ్యం గజ వల్లే నాగ పవన్ కుమార్ భాగవతుల రవికుమార్ తేలగం శెట్టి పావని దేవి పాల్గొంటారని తెలియజేశారు.

# గంజాయి విక్రయిస్తున్న ముఠా అరెస్టు

**రాజుపాలెం, మేజర్ న్యూస్ :**



మండలంలోని చౌటపాపాయపాలెం గ్రామంలో గంజాయి అమ్ముతున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ ఎం. హనుమంతరావు తెలిపారు. మంగళ వారం రాజుపాలెం పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సత్తెనపల్లి డీఎస్పీ ఈ కేసు వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ సోమవారం రాజుపాలెం మండలం చౌటపపాయపాలెం గ్రామ రైల్వే గేట్ వద్ద జీవనం సాగిస్తున్న కుందురు దుర్గారావు ఇంటి వద్ద క్రోసూరు మండలం పారుపల్లి గ్రామవాసి పారుపల్లి భూలక్ష్మి, చౌటపాయపాలెం గ్రామానికి చెందిన కుందూరు దుర్గారావు, వల్లాల ప్రసాద్ అనువారికి గంజాయి అమ్ముతుండగా మెరుపు దాడి చేసి రెండు కిలోల గంజాయిని, వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి రెండు ఫోన్లను రూ 3100 రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు. చౌటపాపయపాలెం గ్రామంలో గంజాయి అమ్ముతున్నారన్న పక్క సమాచారం తో సత్తనపల్లి రూరల్ సిఐ ఎం.వి .సుబ్బారావు, రాజుపాలెం ఎస్సై కే.వేణుగోపాల్ తనిఖీ నిర్వహించగా కుందూరు దుర్గారావు అనే వ్యక్తి గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి ఎక్కువ ధరకు అమ్ముకుందామని ఆలోచనతో తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి తమ బంధువుల గ్రామమైన నర్సీపట్నం మండలం చింతపల్లి గ్రామం పరిసర గ్రామాల్లో నుండి తెచ్చి యువతకు గంజాయి తాగే అలవాటు ఉన్నవారికి అమ్ముకుంటూ లాభాలు గడిస్తున్నారు. సోమవారం దుర్గారావు గంజాయి అమ్ముతున్నాడు అన్న పక్కా సమాచారంతో జిల్లా ఎస్పీ కే. శ్రీనివాసరావు ఆదేశాల మేరకు సత్తనపల్లి డిఎస్పీ ఎం. హనుమంతరావు పర్యవేక్షణలో సత్తనపల్లి రూరల్ సీఐ ఎం వి సుబ్బారావు ఆధ్వర్యంలో రాజుపాలెం ఎస్సై కే వేణుగోపాల్ సిబ్బంది తో కలిసి నిందితులను కదుపులోకి తీసుకొని అరెస్టు చేశారన్నారు.

# హార్వెస్ట్ ఇండియా గ్రాండ్ క్రిస్మస్

**గుంటూరు, మేజర్ న్యూస్ :**



సెలబ్రేషన్స్ వేడుకలు మంగళవారం చేబ్రోలు మండలం గరువుపాలెం లోని హార్వెస్ట్ ఇండియా క్యాంపస్ లో ఘనంగా జరిగాయి ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్మన్ కత్తెర హెనీ క్రిస్టినా రాష్ట్ర తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ కత్తెర సురేష్ కుమార్లు పాల్గొన్నారు. కార్యక్రమంలో మాస్ వ్యవస్థాపక అధ్యక్షుడు తెలుగుదేశం నాయకుడు సుద్ధపల్లి నాగరాజు రెవరెండ్ మనోజ్ రెవరెండ్ సుధాకర్ డానియల్ రెవరెండ్ నిరీక్షణ జ్యోతి తమ సందేశాన్ని అందించగా సమావేశానికి రెవరెండ్ సమర్పణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కత్తెర దంపతుల కుమారుడైన డాక్టర్ యశ్వంత్ యాశ్లీ కుమారునికి పాస్టర్లు ఆశీర్వచనాలు అందజేశారు . కార్యక్రమంలో శౌరి పరంజ్యోతి అనంత్ రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## సోలో ఎగ్జిబిషన్ లో ఆకట్టుకున్న కళాకృతులు

**ఏ ఎన్ యు/ పెదకాకాని, మేజర్ న్యూస్:-**



ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం లోని డిపార్ట్మెంట్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ విభాగం ఆధ్వర్యంలో సోలో ఎగ్జిబిషన్ మంగళవారం ప్రారంభమైంది. ఈ ఎగ్జిబిషన్ ను ఇన్చార్జి విసి ఆచార్య కె. గంగాధరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన సోలో ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్న విద్యార్థి కె.రామును అభినందించారు. విద్యార్థుల్లోని నైపుణ్యాలు ఇటువంటి ప్రదర్శనల ద్వారా బహిర్గతం కావలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ముఖ్యంగా కళా నైపుణ్యాలు, సృజనాత్మకత నిరంతరం విద్యార్థులు అవగాహన చేసుకుంటే ఉన్నతులుగా రాణిస్తారని పేర్కొన్నారు. రాము రూపొందించిన 20 కళాకృతులు విశేషంగా ఆకట్టుకుంటున్నాయని అన్నారు. ఇటువంటి కళ కృతులు ఇంటీరియర్ డెకరేషన్ కు దోహదపడతాయని తద్వారా ఉపాధి రంగాల్లో రాణించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫైన్ ఆర్ట్స్ విభాగాధ్యాపకులు అసిస్టెంట్ కోఆర్డినేటర్ బి. శేఖర్ బాబు, పి. శ్రీనివాస్, పి. దేవకాంత్, సి ఎస్ ఆర్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఎం .వి. రమణ తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూ సదస్సులు అన్ని రకాల సౌకర్యాలు ఉచితం

**- గామాలపాడు తాసిల్దార్ కుటుంబరావు**



**దాచేపల్లి, మేజర్ న్యూస్**

దాచేపల్లి మండలంలో గ్రామాలపాడు, శంకరాపురం గ్రామాలలో రెవెన్యూ సదస్సును తాసిల్దార్ కుటుంబరావు నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా గ్రామం లోని ఎస్సీ కాలనీలో గ్రామ సర్పంచ్ జంగా సురేష్ తో కలిసి పర్యటించారు. వారికి రెవెన్యూ సదస్సుల గురించి కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం గ్రామ సచివాలయం వద్ద ఏర్పాటుచేసిన రెవెన్యూ సదస్సులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామాలపాడు గ్రామంలో వచ్చిన 22 అర్జీలను ఆన్లైన్ లో నమోదు చేసి వారికి అర్జీ నంబరు కేటాయించామని తద్వారా ముటేషన్ సమస్య అయితే 15 రోజుల్లో పరిష్కరిస్తామని క్యాస్ట్ ఇన్కమ్ సర్టిఫికెట్లకు సంబంధించిన సమస్యలను ఒక్కరోజులోనే పరిష్కరిస్తామని రెవెన్యూ సదస్సులను ప్రజలు వినియో గించుకోవాలని తాసిల్దార్ కుటుంబరావు కోరారు. ఈ కార్యక్రమంలో సుంకర శ్రీనివాసరావు, గ్రామ టిడిపి అధ్యక్షులు శంకరశెట్టి జానకి రామయ్య, శంకర శెట్టి సుబ్బారావు, బత్తుల నాగేశ్వరరావు, చాప కొండలు, కాలవ సాంబశివరావు చాప సాంబశివ రావు బత్తుల గిరి తదితరులు పాల్గొన్నారు

# మనసున్న మారాజు డాక్టర్ పి.వి.జి. రాజు దాతృత్వానికి ప్రతీక



**గుంటూరు, మేజర్ న్యూస్:**

డాక్టర్ పి.వి.జి. రాజు మంచి మనసున్న మహారాజు అని, దాతృత్వానికి నిలువుటద్దమని, అలాంటి కుటుంబంలో జన్మించే అవకాశం కలగడం భగవంతుడు అందించిన వరం అని పూర్వ కేంద్ర మంత్రివర్యులు పి. అశోక్ గజపతి రాజు పేర్కొన్నారు. బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 17వ తేదీ మంగళవారం గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో డాక్టర్ పి వి జి రాజు శత జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా విచ్చేసిన పూర్వ కేంద్ర మంత్రి వర్యులు పూసపాటి అశోక గజపతిరాజు మాట్లాడుతూ ఎదిగే కొద్దీ అహం పెంచుకోవద్దని, సమయ పాలన పాటించమని, క్రమశిక్షణతో పెరగాలని తన తండ్రి చెప్పిన మాటలను గౌరవిస్తూ జీవిస్తునానన్నారు. ఈ కార్యక్రమంలో మానవత నేతలు పావులూరి రమేష్, టి. ధనుంజయ రెడ్డి, రెడ్ క్రాస్ డిస్ట్రిక్ ఫీల్డ్ ఆఫీసర్ షేక్ జానీ రసూల్, బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వర రావు, శాసన మండలి సభ్యులు కె.ఎస్. లక్ష్మణరావు, మాజీ మంత్రివర్యులు డొక్కా మాణిక్య వరప్రసాద్, ఇండియన్ టొబాకో అసోసియేషన్ కార్యదర్శి యార్లగడ్డ చౌదరి తదితరులు ప్రసంగించారు.

# కొండగురునాథ స్వామి విశ్వబ్రాహ్మణ అన్నదాన సత్రం నూతన కమిటి




**నూజెండ్ల, మేజర్ న్యూస్**

నూజండ్ల మండలం రవ్వవరం కొండగురునాథస్వామి కొండ వద్ద గల విశ్వబ్రాహ్మణ అన్నసత్రం నందు ఆదివారం అధ్యక్షులు వాలిచర్ల వెంకటేశ్వర్లు అధ్యక్షతన కొండగురునాథ స్వామి అన్నదాన సత్రం నూతన కమిటి ఏకగ్రీవంగా ఏర్పాటు చేయడమైనది. ప్రధాన కార్యదర్శి రామడుగు వెంకటశివ, కోశాధికారి కుందుర్తి హనుమంతాచారి,ఉపాధ్యక్షులు సత్తెనపల్లి బాలకృష్ణ,సహాయ కార్యదర్శి పదిర నాగబ్రహ్మాచారి,కార్యనిర్వ హణ కార్యదర్శి జుజ్జూరి వాసు గార్లని నూజండ్ల, ముండ్ల మూరు, దర్శి మండలాల వారు ఏకగ్రీవంగా ఎన్నుకొనడ మైనది.ఈ కార్యక్రమం లో వినుకొండ విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు దీకొండ వెంకటాచారి, శనగపాటి నాగలింగా చారి, ఉలవలపూడి రాము,వద్దిపాటి కాశీ వెంకటాచారి, వేముల నల్లగట్ల ఈశ్వరాచారి, కుందుర్తి సీతారామాంజ నేయులు, చింతలపూడి నాగాచారి, నూజండ్ల మండల నాయకులు మోతడక వీరాచారి, చింతలచెర్వు గురువాచారి,కనగాల ఆంజనేయులు, చందలూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## పదవీ బాధ్యతల స్వీకరణ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న గురజాల శాసనసభ్యులు యరపతినేని



**పిడుగురాళ్ల, మేజర్ న్యూస్**

పట్టణంలో ని జానపాడు రోడ్డు లోని శుభమస్తు కళ్యాణ మండపం నందు గురజాల నియోజకవర్గం సాగునీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవీ బాధ్యతల స్వీకరణ మహోత్సవం కార్యక్రమంలో గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు పాల్గొని ఎన్నికైన ప్రతినిధులకు దుశాలువా కప్పి అభినందించటం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాగునీటి సంఘాల ఎన్నికలు మన 14 వాటర్ డివిజన్ అసోసియేషన్ ప్రెసిడెంట్ లు, వైస్ ప్రెసిడెంట్లు ఎన్నికలు జరిగినాయి. ఈరోజు డిస్ట్రిబ్యూటర్ కమిటీ చైర్మన్ లు, వైస్ చైర్మన్ ఎన్నికలు జరిగినాయి. మన నియోజకవర్గంలోని డీసీ, రీటి సోదరులు పులుకూరి కాంతారావు ఏకగ్రీవంగా ఎన్నికైనారు. ఆకూరి వెంకటరెడ్డి రామాపురం, వైస్ చైర్మన్ గా ఎన్నికైనారు. డీసీ 2 కి రాయపాటి రామారావు చైర్మన్ గా, వైస్ చైర్మన్ గా చావా రామారావు గా డీసీ 5 కి గండికోట వెంకటేశ్వర్లు చైర్మన్, వైస్ చైర్మన్ బవిరిశెట్టి శివన్నారాయణ మల్లవోలు, డీసీ 6 పగడాల భాస్కరరావు చైర్మన్, వైస్ చైర్మన్ పాశం చిన వెంగల్ రెడ్డి వైస్ చైర్మన్ గా ఎన్నికైనారు. ఇప్పుడే డిక్లరేషన్ ఫారం తీసుకొని వచ్చారు. మన నియోజకవర్గ పరిధిలో నాలుగు డీసీలు, చైర్మన్లు, వయసు చైర్మన్లు, మొత్తం 37 తాగినీటి సంఘాల ఎన్నికలు కూడా జరిగినాయి. ఈ కార్యక్రమం మీ అందరి సమక్షంలో పెట్టుకుంటే బాగుంటుందని ఇక్కడ ఏర్పాట్లు చేశారు. వేదిక మీద ఆశీస్సులు అయిన భారతీయ జనతా పార్టీ నాయకులు, జనసేన పార్టీ నాయకులు, తెలుగుదేశం పార్టీ నాయకులు ఈ కార్యక్రమంలో వివిధ హోదాల్లో వచ్చిన నాయకులందరకీ నా హృదయపూర్వక నమస్కారాలు అన్నారు.

# హిందూపురం నుంచి ఎడ్ల బండిపై వచ్చిన రైతులు కలిసిన పవన్ కళ్యాణ్

**తన కార్యాలయంలో వినతి పత్రం ఇవ్వాలని రైతుకు సూచన**



**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మంగళవారం స్పందించారు. హిందూపురం నుంచి మంగళగిరికి ఎడ్లబండిలో వచ్చిన నవీన్ అనే రైతును పవన్ కలిశారు. అతడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఈ సందర్భంగా అతడు వివరించాడు. పంట ఉత్పత్తులను అమ్ముకోలేక పోతున్నామని.. దళారుల బెడద ఎక్కువైందని ఆవేదన వ్యక్తం చేశాడు. దీంతో రైతుల సమస్యలపై తన కార్యాలయంలో వినతి పత్రం ఇవ్వాలని అతడికి పవన్ సూచించారు. రాష్ట్రపతి పర్యటన వల్ల అధిక సమయం కేటాయించలేకపోతున్నానని తెలిపారు.

**ఎడ్లబండిపై 28 రోజులు.. 760 కిలోమీటర్లు**

రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకొచ్చేందుకు సత్యసాయి జిల్లా పరిగి మండలం శాసనకోటకు చెందిన యువరైతు నవీన్‌కుమార్ ఎడ్లబండిపై సుదీర్ఘ యాత్ర చేపట్టారు. హిందూపురం నుంచి ఎడ్లబండిపై బయలుదేరి.. 28 రోజులపాటు వివిధ ప్రాంతాల్లోని రైతులను చైతన్యవంతం చేస్తూ.. 760 కిలోమీటర్లు ప్రయాణించి, మంగళగిరిలోని జనసేన కార్యాలయం వద్దకు చేరుకున్నారు. ఆ రైతుకు ఉప ముఖ్యమంత్రితో మాట్లాడే అవకాశం లభించలేదు. ఎడ్లకు గ్రాసం లేని పరిస్థితి నెలకొనడంతో కొందరు రైతులు సాయం చేస్తున్నారు. అతడి పరిస్థితి చూసి పవన్ కల్యాణ్ స్పందించారు. రైతు వద్దకు వెళ్లి మాట్లాడారు.

# జగన్ మోహన్ రెడ్డి సహవాసం వాసనలు ఇంకా పోలేదా?

**పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల విమర్శ**



**గుంటూరు, మేజర్ న్యూస్ :** తెలంగాణ మంత్రి పొంగులేటి చేసిన వ్యాఖ్యలను పొన్నూరు శాసనసభ్యులు ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ మంగళవారం ఖండించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ అమరావతి నభూతో నభవిష్యత్ గా అభివృద్ధి చెందబోతుందనేది సత్యం. దీనిపై విమర్శించడం పొంగులేటికి తగదని ఎదో చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చాక అమరావతితో పాటు అన్ని ప్రాంతాలు అభివృద్ధి జరుగుతున్నాయని చెప్పారు.తెలంగాణా రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ వ్యాఖ్యలు హాస్యాస్పదం, ఉద్దేశ్యపూర్వకం ఉన్నాయని నరేంద్ర విమర్శించారు. జగన్ మోహన్ రెడ్డి అనుంగులు విధిగా చేసే వ్యాఖ్యలే ఇపుడు పొంగులేటి చేస్తున్నారని ధ్వజమెత్తారు. జగన్ మోహన్ రెడ్డి మిత్రత్వం వాసనలు ఇంకా పోలేదా అని ప్రశ్నించారు. గడిచిన ఆరు నెలల్లో ఆంధ్రాకు వచ్చిన పెట్టుబడులు చంద్రబాబు దార్శనికతకు, అమరావతి ప్రగతికి నిదర్శనాలనీ ఈ విషయాలను తెలుసుకోవాలని ఆయన మంత్రి పొంగులేటి కి సూచించారు.

# బాధితులకు అండగా సీఎం సహాయనిధి

**చెక్కులను లబ్ధిదారులకు అందజేసిన శాసన సభ్యులు కన్నా**



సత్తెనపల్లి, మేజర్ న్యూస్ : కార్పొరేట్ స్థాయిలో వైద్యం పొందలేని బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తుందని శాసన సభ్యులు కన్నా లక్ష్మీనారాయణ అన్నారు.నియోజకవర్గంలోని పలువురు ముఖ్యమంత్రి సహాయ నిధి లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందించారు. చెక్కులను అందుకున్న వారిలో అబ్బురు గ్రామానికి నుండి యడలపురపు అనూష రూ.1,48,952, గుజ్జర్ల పూడి గ్రామానికి చెందిన గంగూరు మధుసూదన్ రావు రూ.1,46,075, నకరికల్లు నుండి తిరుమల శెట్టి వెంకయ్యకు రూ.1,26,990, గోళ్ళపాడు నుండి చింకా నాగేంద్ర రూ.1,03,926 అందుకున్నారు.

# రైతుల సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధే లక్ష్యం

- రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్, టి.విజయ్ కుమార్ వెల్లడి
- విజ్ఞాన్స్ యూనివర్సిటీలో ఘనంగా ప్రారంభమైన అంతర్జాతీయ సదస్సు




**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

రైతు సాధికార సంస్థ ప్రధానంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రైతుల సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధి, మరియు జీవనోపాధి మెరుగుదలకు కృషి చేయడమే లక్ష్యమని రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్, ఏపీ ప్రభుత్వ డిపార్ట్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ కోఆపరేషన్ అడ్వైజర్, మాజీ ఐఏఎస్ టీ.విజయ్ కుమార్ అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ ఫుడ్ టెక్నాలజీ విభాగంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చరల్ అండ్ హార్టికల్చరల్ సైన్సెస్, అపారి ( ఆసియా%–%పసిఫిక్ అసోసియేషన్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్స్) మరియు యూరోపియన్ ప్లాంట్ హెల్త్ రీసెర్చ్ అండ్ కోఆర్డినేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో " ప్లాంట్ హెల్త్ ఇన్ ఆసియా : రీసెర్చ్ ప్రయారిటీస్ అండ్ పార్ట్‌నర్‌షిప్స్" అనే అంశంపై రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఇంటర్నేషనల్ సదస్సును మంగళవారం ఘనంగా ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్, ఏపీ ప్రభుత్వ డిపార్ట్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ కోఆపరేషన్ అడ్వైజర్, మాజీ ఐఏఎస్ టీ.విజయ్ కుమార్ మాట్లాడుతూ రైతులకు ఆర్థిక, సాంకేతిక సహాయం, ఉచిత సలహాలు, మార్గదర్శకాలు అందిస్తామన్నారు. వీటితో పాటు సేంద్రియ వ్యవసాయాన్ని కూడా ప్రోత్సహిస్తామన్నారు. రసాయన యుక్త వ్యవసాయానికి ప్రత్యామ్నాయంగా సేంద్రియ విధానాలను ప్రోత్సహించడం, సేంద్రియ ఎరువులు, విత్తనాలు, పద్ధతులపై అవగాహన కూడా కల్పిస్తామన్నారు. రైతులకు వ్యవసాయ పెట్టుబడుల కోసం సబ్సిడీలు అందించడం, పంటల బీమా పథకాలను అమలు చేయడం, పంటల డైవర్సిఫికేషన్, రైతులను వివిధరకాల పంటలు సాగు చేసుకునేలా ప్రోత్సహించడం, మార్కెటింగ్ సదుపాయాలు కల్పిస్తామన్నారు. మట్టిని, నీటిని, ప్రకృతి వనరులను సంరక్షించే విధానాలను అమలు చేయడం, హానికరమైన పద్ధతులను తగ్గించి, పర్యావరణ హితమైన పద్ధతులకు ప్రోత్సాహిస్తామన్నారు. అంతేకాకుండా రైతులకు కొత్త వ్యవసాయ పద్ధతులపై శిక్షణలు అందించడం, మౌలిక వసతులు, ఆధునిక పద్ధతులపై అవగాహన కల్పించడం, రైతు స్వాభిమానాన్ని పెంపొందిం చడం తమ లక్ష్యమన్నారు. రైతుల జీవనోపాధిని మెరుగుపరచడం ద్వారా గ్రామీణాభివృద్ధి సాధించడం తమ లక్ష్యాలలో భాగమన్నారు. రైతు బంధు, రైతు భరోసా వంటి పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తామన్నారు. రైతు సాధికార సంస్థ ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ రంగాన్ని పునరుజ్జీవింప జేయడంతో పాటు రైతుల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. కార్యక్రమానికి మరో ముఖ్య అతిథిగా హాజరైన బ్యాంకాక్‌లోని అపారి ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ డాక్టర్ రవి ఖేతర్‌పాల్ మాట్లాడుతూ ఆహార ఉత్పత్తి నుంచి వినియోగం వరకు వ్యవసాయ – ఆహార వ్యవస్థలో ఆధునిక పద్ధతులను అనుసరించడం అవసరమన్నారు. వృక్షాల ఆరోగ్యాన్ని పరిరక్షించడంలో ఫీల్డ్ సెన్సార్లు, డ్రోన్లు, డిజిటల్ పద్ధతుల ఉపయోగం ఎక్కువగా కనిపిస్తుందన్నారు. ఈ టెక్నాలజీలు వ్యవసాయ ప్రదేశాలలో తక్షణమే వ్యాధులను గుర్తించి, వాటిని నివారించేందుకు సహకరిస్తాయని వెల్లడించారు. స్మార్ట్ ఫోన్లు, డేటా అనలిటిక్స్ ఆధారంగా పురుగుల దాడిని ముందుగానే అంచనా వేసి, సమయానుకూలంగా చర్యలు తీసుకోవడం సాధ్యమవుతుందన్నారు. రసాయన వినియోగాన్ని తగ్గించేందుకు, ప్రకృతి ఆధారిత పరిష్కారాలను ప్రోత్సహించే ప్రణాళికలు తీసుకోవడం ద్వారా వృక్ష ఆరోగ్యానికి మాత్రమే కాకుండా మట్టి ఆరోగ్యానికీ అనుకూలంగా ఉంటాయన్నారు. డిజిటల్ వ్యవసాయం, ఏఐ, ఐవోటీ వంటి టెక్నాలజీల సహాయంతో వ్యవసాయ దిగుబడులను మెరుగుపరచడమే కాకుండా, వృక్షాలకు అనుకూలమైన ఆహారపదార్థాల ఉత్పత్తికి కూడా తోడ్పడతాయన్నారు. సేంద్రియ, ఇన్నోవేటివ్ పద్ధతులు వృక్ష ఆరోగ్యంతో పాటు ప్రకృతి ఆరోగ్యాన్ని కూడా పెంపొందిస్తాయన్నారు. కార్యక్రమానికి మరో ముఖ్య అతిథిగా హాజరైన యూరోపియన్ ఫైటోశానిటరీ రీసెర్చ్ కోఆర్డినేషన్ కోఆర్డినేటర్ డాక్టర్ బల్దిస్సెర జీవాని మాట్లాడుతూ యూరోపియన్ ఫైటోశానిటరీ రీసెర్చ్ ద్వారా పరిశోధన ప్రాజెక్టులను సమన్వయం చేయడంతో పాటు వృక్ష ఆరోగ్యం సంబంధిత పరిశోధన ప్రాజెక్టులలో వివిధ దేశాల పరిశోధకులను కలిసి పని చేయడానికి సహాయపడుతుందన్నారు. వృక్ష ఆరోగ్య విధానాలకు మద్దతు ఇవ్వడం, వృక్ష ఆరోగ్యంపై యూరోపియన్ విధానాలను మెరుగుపరచడంలో ఈ సంస్థ పరిశోధన చేస్తూ, శాస్త్రీయ ఆధారాలను అందిస్తుందన్నారు. మా సంస్థ వ్యవసాయం, అడవులపై ముప్పు కలిగించే వృక్ష పశు వ్యాధులు, పెచ్చులను గుర్తించడం, పర్యవేక్షించడం, నిర్వహించడం కోసం పని చేస్తుందన్నారు. యూరోపియన్, అంతర్జాతీయ పరిశోధకులు, సంస్థల మధ్య సహకారాన్ని పెంచడంలో సహాయపడుతుందన్నారు. తద్వారా ప్రపంచవ్యాప్తంగా వృక్ష ఆరోగ్య సమస్యలను పరిష్కరించడానికి సహాయం చేస్తామన్నారు. వ్యవసాయ ఉత్పత్తి మరియు పర్యావరణ సుస్థిరతను మెరుగుపరచడానికి వృక్ష వ్యాధులు, పెచ్చులను సమర్థవంతంగా నిరోధించడం, నిర్వహించడం ద్వారా కీలక పాత్ర పోషిస్తుందన్నారు. అనంతరం అంతర్జాతీయ సదస్సులో భాగంగా అగ్రి ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్స్ అండ్ పబ్లిక్ ప్రై వేట్ ఫార్మర్ పార్టనర్‌షిప్ ఫర్ ప్లాంట్ హెల్త్, ఆర్టిఫిసియల్ ఇంటెలిజెన్స్ అండ్ ఐవోటీ ఫర్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్, ప్లాంట్ హెల్త్ అడ్వోకసీ ఇన్ ఆసియా, చేంజింగ్ పెస్ట్ సినారియో, ఎపిడిమాలజీ, ఫోర్‌కాస్టింగ్ అండ్ మోనిటరింగ్ ఇన్ రిలేషన్ టు క్లైమేట్ చేంజ్ అనే అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో యూరోపియన్ ఫైటోశానిటరీ రీసెర్చ్ కోఆర్డినేషన్ కోఆర్టినేటర్ డాక్టర్ బల్దిస్సెర జీవాని, హైదరాబాద్‌లోని ఐకార్%–%ఐఐవోఆర్ ప్రాజెక్ట్ మేనేజర్ డాక్టర్ కే.ఎస్.వరప్రసాద్, అసారి టెక్నికల్ కోఆర్డినేటర్ డాక్టర్ పాల్ డబ్ల్యూజే టేలర్, సౌత్ ఆసియా కాబి ఇంటర్నేషనల్ రీజనల్ డైరక్టర్ డాక్టర్ వినోద్ పండిట్, విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వర్సిటీ వైస్ చాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పీ.నాగభూషణ్, ఇంచార్జి రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, పరిశోధన విద్యార్థులు పాల్గొన్నారు.

# వక్ఫ్ బోర్డు ఆస్తులకు కంచెలా పని చేస్తాం : ఎమ్మెల్యే నసీర్

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**



వక్ఫ్ బోర్డు ఆస్తుల పరిరక్షణకు కంచెలా పని చేస్తామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, వక్ఫ్ బోర్డు కమిటీ మెంబర్ నసీర్ అన్నారు. మంగళవారం విజయవాడలో వక్ఫ్ బోర్డు రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన చైర్మన్ ఎంపిక కార్యక్రమానికి ఎమ్మెల్యే నసీర్ హాజరయ్యారు. వక్ఫ్ బోర్డ్ సభ్యుడైన నసీర్ తో పాటు మిగిలిన సభ్యులు చైర్మన్ గా అబ్దుల్ అజీజ్ ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా తూర్పు ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ చట్టం నిబంధనలకు అనుగుణంగా నూతన కార్యవర్గం పని చేస్తుందని వక్ సంస్థను మరింత బలోపేతం చేసేందుకు సంస్థ అభివృద్ధికి కొత్తదారులు ప్రణాళికలతో కమిటీ ముందుకు వెళుతుందని తెలిపారు. అలాగే వక్ఫ్ బోర్డు ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా కంచెలాగా పని చేస్తామన్నారు. ఈ కమిటీ వినూత్న వ్యూహాలను అమలు చేయడంలో, కమ్యూనిటీతో సహకారం పెంపొందించడంలో , ప్రత్యేక లక్ష్యం సాధనలో కీలకమైన పాత్ర పోషిస్తుంది. ప్రతిసభ్యుడు తన సొంత ప్రత్యేక దృష్టికోణాన్ని పరిగణంలోకి తీసుకొని ఉత్తమ మార్గాలను రూపొందించి వక్ఫ్ అభివృద్ధికి కృషి చేస్తుంది." అని తెలిపారు. కమిటీ 1554లో వక్ఫ్ చట్టం తీసుకొచ్చారని, ఇది అపరిమిత అధికారాలు కలిగి ఉందని వివరించారు. కూటమి ప్రభుత్వం ముస్లింల ఆత్మగౌరవం కాపాడటమే లక్ష్యంగా పని చేస్తోందని తెలిపారు. మైనారిటీల కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అనేక పథకాలు ప్రవేశపెట్టి వారి అభ్యున్నతికి పాటుపడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో వక్ఫ్ బోర్డ్ సభ్యులు తమీమ్ అన్సారీయా ఐఏఎస్,హాజీ ముక్రం హుస్సేన్, సయ్యద్ దావూద్ భాష, షేక్ అక్రమ్, డాక్టర్. అఫియా, షేక్ ఖాజా మొహిద్దిన్ మోతవల్లి, మహమ్మద్ ఇస్మాయిల్ బేగ్, వక్ఫ్ సీఈఓ అబ్దుల్ ఖాదిర్ తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూ సదస్సులు నిర్వహించడం అభినందనీయం : దేశవత్ మల్లయ్య నాయక్



**వెల్దుర్తి, మేజర్ న్యూస్ :** పల్నాడు జిల్లా, వెల్దుర్తి మండలం, శ్రీరాంపురం తండా నందు రెవెన్యూ సదస్సులు నిర్వహించడం పట్ల శ్రీరాంపురం తండా తెదేపా సీనియర్ నాయకులు దేశావత్ మల్లయ్య నాయక్ కూటమి ప్రభుత్వానికి అభినందనలు తెలియ జేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ గ్రామంలో భూ సమస్యలను పరిష్కరించుకునేందుకు రెవెన్యూ సదస్సులు ఎంతగానో ఉపయోగపడుతు న్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. రైతుల భూముల రికార్డులలో ఉన్న తప్పులను సరి చేసుకోవడం రెవెన్యూ సదస్సుల ముఖ్య ఉద్దేశం అని ఆయన అన్నారు. గ్రామ ప్రజలు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాల్సిందిగా ఆయన కోరారు. ఈ సదస్సులలో దరఖాస్తు చేసుకోవడం ద్వారా 45 రోజులలోనే సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని గ్రామస్తులకు తెలియజేశారు.